## కేటీఆర్‌కు మద్దతుగా తరలిన బీఆర్ఎస్ నాయకులు



కోహెడ: హైదరాబాద్‌కు తరలిన మండల నాయకులు



బెజ్జంకి: బీఆర్ఎస్ భవన్‌కు తరలిన మండల నాయకులు

కోహెడ, జూన్ 16: రాష్ట్ర ప్రభుత్వం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై పెట్టిన కేసులో సోమవారం విచారణకు వెళ్లిన కేటీఆర్‌కు మద్దతుగా మండల బీఆర్ఎస్ నాయకులు బీఆర్ఎస్ భవన్‌కు మాజీ ఎమ్మెల్యే సతీష్ కుమార్ ఆధ్వర్యంలో తరలి వెళ్లారు. జిల్లా నాయకులు పొన్నాల లక్ష్మణ్, భీంరెడ్డి రాజిరెడ్డి, తోట ఆంజనేయులు, అబ్దుల్ రహీం, పెరుగు నరేందర్‌రెడ్డి, బత్తిని తిరుపతి ఉన్నారు.

## ఎమ్మెల్యే కోలుకోవాలని చర్చిలో ప్రార్థనలు



మెదక్ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న నాయకులు

చేర్యాల, జూన్ 16: ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి త్వరగా కోలుకోవాలని కోరుతూ సోమవారం మెదక్ చర్చిలో బీఆర్ఎస్ నాయకులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి కోతి దాసు, నాయకుడు ఎర్రోళ్ల యాదగిరి, మండల యూత్ అధ్యక్షుడు ఆకుల రాజేష్‌గౌడ్, సోషల్ మీడియా మండల అధ్యక్షుడు బంగారిగళ్ల కిరణ్ కుమార్ మెదక్ చర్చికి వెళ్లి అక్కడ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. నియోజకవర్గంలో ప్రజలకు సమస్య ఏర్పడితే అప్పటికప్పుడు పరిష్కరిస్తున్న జననేత త్వరగా కోలుకోవాలని ప్రార్థించినట్లు వారు తెలిపారు.

## దైవదర్శనాలకు ఆర్టీసీ ప్యాకేజీ

సిద్దిపేట టౌన్, జూన్ 16: సిద్దిపేట ఆర్టీసీ డిపో నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లేందుకు ప్రత్యేకంగా ప్యాకేజీ టూర్‌లను అందుబాటులోకి తెచ్చింది. డిపో మేనేజర్ రఘు సోమవారం మాట్లాడుతూ సిద్దిపేట నుంచి యాదగిరిగుట్ట, కొమురవెల్లి, స్వర్ణగిరి, వర్గల్, నాచారం, ఆలయాలకు ఒక్కరోజు ప్యాకేజీని ఏర్పాటు చేశామన్నారు. పెద్దలకు రూ. 540, పిల్లలకు రూ. 290లు, నాంపల్లి గుట్ట, వేములవాడ, ధర్మపురి, కొండగట్టు దేవాలయాలకు పెద్దలకు ఎక్స్‌ప్రెస్ బస్సు రూ.570, పిల్లలకు రూ. 300 చెల్లించాలన్నారు. రెండు రోజుల టూర్ గల రామప్ప, వరంగల్, లక్నవరం, భద్రాచలం ఆలయాల దైవ దర్శనాలకు పెద్దలకు రూ. 1180లు, చిన్నారులకు రూ. 600లు చెల్లించాలని తెలిపారు. ఉదయం 6 గంటలకు సిద్దిపేట నుంచి బయలుదేరి ఆయా ఆలయాల దర్శనం చేసుకున్నాక తిరిగి రాత్రి 10 గంటలకు సిద్దిపేటకు చేరుకుంటారని వివరించారు. దేవాలయాల సందర్శనకు వెళ్లే భక్తులు 30 మంది ఉంటే వారికోసం ప్రత్యేకంగా బస్సును కేటాయిస్తామన్నారు.

## రాజేశ్వర్‌రెడ్డికి స్వర్ణకంకణం



పురస్కారం అందుకుంటున్న జ్యోతిష్యుడు రాజేశ్వర్‌రెడ్డి

సిద్దిపేట టౌన్, జూన్ 16: సిద్దిపేటకు చెందిన ప్రముఖ జ్యోతిష్యుడు డాక్టర్ రాజేశ్వర్‌రెడ్డికి అరుదైన గౌరవం దక్కింది. విశ్వజ్యోతి జ్యోతిష్య విజ్ఞాన సంస్థ ప్రతినిధులు హైదరాబాద్‌లో 17వ జ్యోతిష సమ్మేళనం సోమవారం ఘనంగా నిర్వహించారు. జ్యోతిష్య శాస్త్రంలో తమదైన ముద్ర వేసి సమాజ సేవ చేస్తున్న ప్రతిభవంతులను గుర్తించి సత్కరించారు. సిద్దిపేటకు చెందిన జ్యోతిష్యుడు డాక్టర్ కలకుంట్ల రాజేశ్వర్‌రెడ్డికి ప్రతిభ పురస్కారంతో పాటు దైవజ్ఞరత్న బిరుదును ప్రకటించి, స్వర్ణ కంకణాన్ని ప్రదానం చేశారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు శ్రీనివాసరావు, జ్యోతిష్య విశారదన్ పాలకుర్తి శ్రీకాంతశర్మ, బ్రహ్మగ్రంథ సంకలన కర్త ఇంద్రగంటి వెంకట గోపాలకృష్ణ శర్మ,విజయ సుబ్రహ్మణం, డాక్టర్ రావు తదితరులు పాల్గొన్నారు.

## సర్కారు బడుల్లోనే ఉత్తమ ఫలితాలు



దుబ్బాక: విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాన్ని అందజేస్తున్న ఎంఈవో, ఉపాధ్యాయులు

దుబ్బాక, జూన్ 16: సర్కారు బడుల్లో గుణాత్మక విద్యనభ్యసించిన విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారని అక్బర్‌పేట-భూంపల్లి ఎంఈవో అంజయ్య తెలిపారు. సోమవారం బడిబాటలో భాగంగా రామేశ్వరంపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పాఠశాలలో పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను సన్మానించి నగదు ప్రోత్సాహకాన్ని అందజేశారు. పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం ఉపాధ్యాయులు డెస్కులు ఏర్పాటు చేయగా, వాటిని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నీలం శ్రీనివాస్, ఉపాధ్యాయులు కురాకుల శ్రీనివాస్, శివాజీ పాల్గొన్నారు.

**ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య**

హుస్నాబాద్‌టౌన్, జూన్ 16: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల్లోనే విద్యా ప్రమాణాలు పెరుగుతాయని స్థానిక జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం వాసుదేవరెడ్డి అన్నారు. సోమవారం ప్రైవేట్ పాఠశాల నుంచి పాఠశాలలో చేరిన విద్యార్థికి అడ్మిషన్ అందజేశారు. మాజీ ఎంపీటీసీ ఎండీ హసన్, ఉపాధ్యాయులు ఉన్నారు.

## కస్తూర్బా పాఠశాలను తరలించాలి




నిరసన వ్యక్తం ఎస్ఎఫ్ఐ నాయకులు

కొమురవెల్లి, జూన్ 16: మండల కేంద్రమైన కొమురవెల్లిలో కొనసాగుతున్న కేజీబీవీని ధూళిమిట్ట మండలానికి తరలించాలని ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి కర్రోళ్ల లెనిన్‌రాజ్ అన్నారు. సోమవారం ఎస్ఎఫ్ఐ మండల కమిటీ ఆధ్వర్యంలో కేజీబీవీ పాఠశాల ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొమురవెల్లి కేజీబీవీ ఇంటర్మీడియట్ వరకు అప్‌గ్రేడ్ కావడంతో విద్యార్థుల సంఖ్య పెరిగి కేజీబీవీ పాఠశాల భవనం సరిపోవడం లేదన్నారు. దీంతో విద్యార్థులు ఇబ్బందుల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు కర్తీక్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

మిరుదొడ్డి (అక్బర్‌పేట-భూంపల్లి), జూన్ 16: అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉంటూ సైబర్ నేరాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని భూంపల్లి ఎస్సై హరీశ్ అన్నారు. సోమవారం అక్బర్‌పేట-భూంపల్లి మండలం భూంపల్లి జడ్పీ పాఠశాలలో మహిళల రక్షణపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్సై మాట్లాడుతూ విద్యార్థి దశలో క్రమశిక్షణగా విద్యనభ్యసించి తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలని సూచించారు. విద్యార్థులు సోషల్ మీడియాకు ఎంత దూరం ఉంటే అంత మంచిదని పేర్కొన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం రాజేందర్, ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీలో సామూహిక అక్షరాభ్యాసం



అక్షరభ్యాసం చేయిస్తున్న సీడీపీవో

కోహెడ జూన్ 16: మండల కేంద్రమైన కోహెడలోని అంగన్‌వాడీ-2 కేంద్రంలో సోమవారం సామూహిక అక్షరభ్యాసం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి సీడీపీవో జయమ్మ ముఖ్య అతిథిగా హాజరై చిన్నారులకు అక్షరభ్యాసం చేయించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి బుధవారం పిల్లలకు కోడిగుడ్డ బిర్యానీ అందించడం జరుగుతుందని తెలిపారు. పిల్లలను రోజూ అంగన్‌వాడీ కేంద్రానికి పంపాలని కోరారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ కవిత, బీసీ కాలనీ స్కూల్ హెచ్ఎం వేణుగోపాల్, అంగన్‌వాడీ టీచర్ విజయ, ఆయా లక్ష్మి, ఆశవర్కర్లు కవిత, పద్మ, పుష్ప, అశ్విని, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# జిల్లా అభివృద్ధికి కలిసి పనిచేయాలి

- కలెక్టర్ హైమావతి



ప్రజావాణిలో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ హైమావతి

సిద్దిపేట, జూన్ 16: జిల్లా అభివృద్ధికి అందరూ కలిసి పనిచేయాలని కలెక్టర్ కె.హైమావతి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు గరీమా అగర్వాల్, అబ్దుల్ హమీద్‌లతో కలిసి ఆమె ప్రజల నుండి వివిధ సమస్యల పరిష్కారానికి అర్జీలను స్వీకరించారు. మొత్తం 98 అర్జీలు అందాయి. కలెక్టర్ అధికారులనిద్దేశించి మాట్లాడుతూ జిల్లా అభివృద్ధికి అధికారులు అందరూ సమన్వయంతో పని చేయాలన్నారు. క్రితం వారం ప్రజావాణి ద్వారా స్వీకరించిన దరఖాస్తుల పరిష్కారానికి తీసుకున్న చర్యల పూర్తి రిపోర్టుతో అధికారులు హాజరు కావాలన్నారు. అత్యవసర పరిస్థితి ఉంటే మాత్రమే ప్రజావాణి రోజు జిల్లా అధికారులకు సెలవు మంజూరు చేస్తానని, అధికారులు తప్పకుండా తన అనుమతి లేకుండా సెలవు పెట్టరాదన్నారు. జిల్లాలో ప్రతి ఒక్క ప్రభుత్వ శాఖ కార్యక్రమాల ప్రగతిపై ప్రతినెల రెండుసార్లు చొప్పున, 15 రోజులకు ఒకసారి సమీక్ష చేస్తానన్నారు. ఆయా శాఖలకు సంబంధించిన జిల్లా స్థాయి నుంచి మండల స్థాయి అధికారులు అందరూ సమీక్షలో పూర్తి నివేదికలతో హాజరుకావాలన్నారు. ఈనెల 21న జిల్లా కేంద్రంలో నిర్వహించే అంతర్జాతీయ యోగా దినోత్సవంలో అధికారులందరూ తప్పక పాల్గొనాలని ఆదేశించారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారి నాగరాజమ్మ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## రైతులు అధికారుల సూచనలు పాటించాలి



రైతునేస్తం కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ హైమావతి

కోహెడ, జూన్ 16: వ్యవసాయ అధికారుల సూచనలు పాటిస్తూ పంటలు సాగు చేసి రైతులు అధిక దిగుబడులు సాధించాలని కలెక్టర్ హైమావతి అన్నారు. మండలంలోని శనిగరం, బస్వాపూర్ రైతు వేదికలలో నిర్వహించిన సీఎం వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతుల సమస్యలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో డీఏవో రాధిక, డీఎంహెచ్‌వో సునీత, ఎంపీవో శోభ, తహసీల్దార్ సయ్యద్ అమీర్ అహ్మద్, ఏవో సతీష్, ఏఈవోలు, రైతులు, పాల్గొన్నారు.

## పోస్టాఫీస్‌ను సద్వినియోగం చేసుకోవాలి



మిరుదొడ్డి: పోస్టాఫీస్ ఖాతా పుస్తకాలను అందజేస్తున్న ఎంపీ రఘునందన్ రావు



సిద్దిపేట అర్బన్: ప్రహరీ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న రఘునందన్‌రావు

మిరుదొడ్డి, జూన్ 16: గ్రామీణ ప్రాంత ప్రజలు కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో సబ్ పోస్టాఫీస్ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ప్రజలు పోస్టల్ సేవలను పొందాలని సూచించారు. కార్యక్రమంలో పోస్టల్ డిపార్టు మెంట్ మెదక్ సూపరింటెండెంట్ శ్రీహరి, అమర్, దేవరాజు పాల్గొన్నారు.

**ప్రహరీ నిర్మాణానికి శంకుస్థాపన**

సిద్దిపేట అర్బన్, జూన్ 16: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చిన తరువాతనే ఎన్నికల నిర్వహణకు వెళ్లాలని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు డిమాండ్ చేశారు. సోమవారం మండల పరిధిలోని పొన్నాల గ్రామ సమీపంలో రూ.20 లక్షలతో నిర్మించే ముదిరాజ్ హాస్టల్ భవనం ప్రహరీగోడకు ఆయన శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు భైరి శంకర్, ముదిరాజ్‌లు పాల్గొన్నారు.

## సదస్సులతో భూ సమస్యలు పరిష్కారం



జాలపల్లిలో దరఖాస్తులను పరిశీలిస్తున్న ఆర్డీవో రామ్మూర్తి

మద్దూరు(ధూళిమిట్ట), జూన్ 16: భూ సమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ సదస్సులను ఏర్పాటు చేస్తున్నట్లు హుస్నాబాద్ ఆర్డీవో వాసం రామ్మూర్తి అన్నారు. సోమవారం మద్దూరు, ధూళిమిట్ట మండలాల్లోని వంగపల్లి, జాలపల్లిలో ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సులను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ గ్రామాల్లో అపరిష్కృతంగా ఉన్న భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు దోహదపడుతాయన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ మహ్మద్ అబ్దుల్ గఫూర్ రహీం సింహాచలం మధుసూదన్, ఆర్ఐలు రమేశ్, అన్వర్, రవీందర్, సిబ్బంది పాల్గొన్నారు.

## సిద్దిపేట ఆరెంజ్ టీమ్ విజయం



మ్యాచ్ ప్రారంభిస్తున్న వెంకటనర్సయ్య

సిద్దిపేట, జూన్ 16: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్, ఉమ్మడి మెదక్ జిల్లా ఆధ్వర్యంలో సిద్దిపేట ఆచార్య జయశంకర్ స్టేడియంలో సోమవారం జరిగిన అండర్-19 జిల్లా వన్డే మ్యాచ్‌లో 2 పరుగులతో సిద్దిపేట ఆరెంజ్ టీమ్ విజయం సాధించింది. అంతకు ముందు సిద్దిపేట డివైఎస్‌వో వెంకట్ నర్సయ్య, సిద్దిపేట జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి కలకుంట్ల మల్లికార్జున్ టాస్ వేసి మ్యాచ్‌ను ప్రారంభించారు. టాస్ గెలిచి సిద్దిపేట పింక్ టీమ్ ఫీల్డింగ్ ఎంచుకుంది. సిద్దిపేట ఆరెంజ్ టీమ్ మొదటగా బ్యాటింగ్ చేసి 45 ఓవర్లలో 10వికెట్లు కోల్పోయి 185 పరుగులు సాధించింది. 186 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్ చేసిన సిద్దిపేట పింక్ టీం 183 పరుగులకు ఆలౌట్ అయ్యింది. ఇందులో పింక్ టీమ్‌కు చెందిన కెప్టెన్ ఇషాంత్ సెంచరీ చేశారు. ఆరెంజ్ టీమ్ బౌలర్ అక్షయ్ కుమార్ 8 వికెట్లు తీసి విజయానికి కీలక పాత్ర పోషించి మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా నిలిచాడు. కార్యక్రమంలో విజయ్, బాబు, మజీద్, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## నకిలీ పత్తి విత్తనాల పట్టివేత

బెజ్జంకి, జూన్ 16: మండల కేంద్రమైన బెజ్జంకి శివారులో విక్రయిస్తున్న నకిలీ విత్తనాలను టాస్క్‌ఫోర్స్ పోలీసులు సోమవారం పట్టుకున్నారు. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ రవీందర్ వివరాలు వెల్లడించారు. బెజ్జంకి శివారులో నకిలీ పత్తి విత్తనాలు అమ్ముతున్నారన్న సమాచారంతో బెజ్జంకి ఎడ్లబండి చౌరస్తా వద్ద మంచిర్యాల జిల్లా కొత్తపల్లి మండలంలోని సర్వాయిపేటకు చెందిన దుర్గం శేఖర్ వద్ద 4కిలోల విడి నకిలీ పత్తి విత్తనాలు లభించగా అతిన్ని అదుపులోకి తీసుకున్నట్టు తెలిపారు. అలాగే బెజ్జంకిలో పట్టుపరిశ్రమ పాత భవనంలో దాచిన 160 కిలోల నకిలీ పత్తి విత్తనాలు స్వాధీనం చేసుకోవడంతో పాటు వాటిని విక్రయించేందుకు వచ్చిన ఏపీలోని కడప జిల్లాకు చెందిన వసంత రాంరెడ్డి, నంద్యాల జిల్లాకు చెందిన కుందవరం ప్రభాకర్‌లను పట్టుకున్నామని తెలిపారు. ఏవో సంతోష్ పరిశీలించి విత్తనాలు నకిలీవిగా ధృవీకరించడంతో కేసు నమోదు చేసి ముగ్గిరిని ఎస్ఐ తిరుపతిరెడ్డి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. సమావేశంలో సీఐ రమేశ్, జానకీరాంరెడ్డి, రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్ఐ తిరుపతిరెడ్డి, సిబ్బంది ఉన్నారు.

## చెత్తరహిత పట్టణంగా తీర్చిదిద్దుదాం



తడి, పొడి చెత్తపై అవగాహన కల్పిస్తున్న కమిషనర్

హుస్నాబాద్ టౌన్, జూన్ 16: హుస్నాబాద్ పట్టణాన్ని చెత్తరహిత పట్టణంగా తీర్చిదిద్దేందుకు ప్రజలు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ గౌడ్ కోరారు. 100రోజుల కార్యక్రమంలో భాగంగా సోమవారం హుస్నాబాద్ పట్టణంలోని తాగునీటి ట్యాంక్‌ను సిబ్బందితో కలిసి ఆయన స్వయంగా శుభ్రంచేశారు. ఇండ్లలో నుంచి వచ్చే తడి, పొడి, హానికరమైన చెత్తను వేర్వేరుగా ఇవ్వాలని కమిషనర్ సూచించారు. తడి చెత్తను ఇంటివద్దనే ఎరువుగా మార్చుకుని మొక్కలకు వేయాలని తెలిపారు. టీ తాగేందుకు స్టీల్ గ్లాసులను ఉపయోగించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ సంపత్ రావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాలఎల్లం, టీఓ రోహిత, వన మహోత్సవం ఇన్‌చార్జి జాలిగాం శంకర్, పర్యావరణ అధికారి రవికుమార్, వార్డు అధికారి వెంకటేశ్ ఉన్నారు.

## ట్రైసైకిళ్లు ఏర్పాటు చేయండి సారూ..





ప్రతి సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణికి జిల్లావ్యాప్తంగా అర్జీదారులు వస్తున్నారు. తాము పడుతున్న ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకొస్తూ అర్జీ పెట్టుకుంటున్నారు. వృద్ధులు, దివ్యాంగులు సైతం వచ్చి అధికారుల ముందు తమ గోస వినిపిస్తున్నారు. అయితే కలెక్టరేట్‌లో ట్రై సైకిళ్లు ఏర్పాటు చేయక పోవడంతో వృద్ధులు, దివ్యాంగులు పలు ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులు స్పందించి వారికోసం ట్రై సైకిళ్లు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

*- నమస్తే తెలంగాణ స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సిద్దిపేట, జూన్ 16*

## మల్లన్న ఆలయంలో వేలంపాట

- రూ.71,77,777 ధర పలికిన కొబ్బరిముక్కల సేకరణ హక్కు



వేలంపాట నిర్వహిస్తున్న ఈవో అన్నపూర్ణ

చేర్యాల, జూన్ 16: కొమురవెల్లి శ్రీ మల్లికార్జున స్వామి వారి ఆలయంలో ఆలయ ఈవో అన్నపూర్ణ ఆధ్వర్యంలో సోమవారం ఈ-టెండర్, సీల్డు టెండరుతో పాటు బహిరంగ టెండర్లు జరిగాయి. దేవాలయంలో కొబ్బరికాయలు అమ్ముకునే లైసెన్స్ హక్కులు, దేవాలయం, ఎల్లమ్మ దేవాలయం వద్ద కొబ్బరిముక్కలు పోగు చేసుకునే లైసెన్స్ హక్కు, మొక్కుబడి వస్త్రాలు ఒడి బియ్యం, పసుపు పోగు చేసుకునే లైసెన్స్ హక్కులకు వేలం పాట నిర్వహించారు. కొబ్బరి ముక్కల సేకరణ హక్కులను కురవికి చెందిన యుగేందర్ రూ.71,77,777లకు దక్కించుకున్నారు. ఇదే టెండరు గతేడాది రూ.39,5000 పలికింది. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

## డ్రగ్స్‌రహిత నియోజకవర్గంగా తీర్చిదిద్దుదాం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఏసీపీ సదానందం తదితరులు

హుస్నాబాద్‌టౌన్, జూన్ 16: హుస్నాబాద్ నియోజకవర్గాన్ని డ్రగ్స్‌రహిత నియోజకవర్గంగా తీర్చిదిద్దుదామని హుస్నాబాద్ ఏసీపీ సదానందం అన్నారు. తన కార్యాలయంలో సోమవారం డ్రగ్స్ నిర్మూలన పోరుయాత్ర పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ డ్రగ్స్ నిర్మూలనకు విద్యార్థులు, యువకులు, తల్లిదండ్రులు కృషి చేయాలన్నారు. డ్రగ్స్‌తో నష్టపోతున్న జీవితాలను గురించి పోరుయాత్ర ద్వారా అవగాహన కల్పిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ జేఏసీ కన్వీనర్ కవ్వ లక్ష్మారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, సీఐ శ్రీనివాస్, జేఏసీ కో ఆర్డినేటర్లు మేకల వీరన్నయాదవ్, డ్యాగల సారయ్య, వివిధ సంఘాల నాయకులు చెప్యాల ప్రకాశ్, గాదపాక రవీందర్, ఉప్పుల కుమారస్వామి, వేముల జగదీశ్, కుమారస్వామి, అశ్వీరాదం, కిరణ్, రవీ, రవీందర్, అశోక్, స్వర్ణలత పాల్గొన్నారు.

## అపూర్వ సమ్మేళనం



చేర్యాల, జూన్ 16: మండలంలోని అర్జునపట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2004-05 విద్యా సంవత్సరం 10వ తరగతి విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థులు సోమవారం ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాడు పాఠాలు బోధించిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## బైక్‌ను ఢీకొట్టిన కారు

**ఇద్దరు యువకులు మృతి...**

దుబ్బాక, జూన్ 16: ఎదురెదురుగా వస్తున్న బైక్, కారు ఢీకొన్న ఘటనలో ఇద్దరు యువకులు మృతిచెందారు. దుబ్బాక మండలం తిమ్మాపూర్ శివారులో పెద్దగుండవెల్లి ఎల్లమ్మ దేవి కామన్ వద్ద (సిద్దిపేట-రామయంపేట రహదారి) ఎన్‌హెచ్ 765 డీజీ జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి ఈ ఘటన జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. అక్బర్‌పేట-భూంపల్లి మండలం రామేశ్వరంపల్లికి చెందిన పల్లె అనిల్ (27) భవన నిర్మాణ కూలీ పనులు చేస్తూ జీవిస్తున్నాడు. ఆదివారం రాత్రి అనిల్ ద్విచక్ర వాహనంపై తన మిత్రుడు ఉచ్చూరి పాపయ్య(30)తో కలిసి సిద్దిపేటకు బయలుదేరారు. ఈ క్రమంలో మార్గమధ్యలో తిమ్మాపూర్ శివారులో పెద్దగుండవెల్లి ఎల్లమ్మ దేవి కామన్ వద్ద ఎదురుగా సిద్దిపేట నుంచి అతివేగంతో వస్తున్న కారు బైక్‌ను ఢీకొట్టింది. బైక్ నడుపుతున్న అనిల్ అక్కడికక్కడే మృతిచెందాడు. తీవ్ర గాయాల పాలైన పాపయ్యను 108 వాహనంలో సిద్దిపేట సర్కారు దవాఖానకు తరలించగా, పరిస్థితి విషమంగా ఉండటంతో అక్కడి నుంచి సికింద్రాబాద్ గాంధీ దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతిచెందాడు. మృతుడు అనిల్ సోదరుడు బాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, విచారణ చేపట్టినట్లు ఎస్సై గంగరాజు తెలిపారు.

## విద్యార్థుల దుస్థితి ప్రభుత్వానికి పట్టదా?

సిద్దిపేట టౌన్, జూలై 16: సిద్దిపేట కేసీఆర్ నగర్ డబుల్ బెడ్‌రూమ్ గృహ సముదాయంలో కొనసాగుతున్న ప్రభుత్వ పాఠశాల దుస్థితి ప్రభుత్వానికి పట్టదా అని యుఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గుడికందుల రవి ప్రశ్నించారు. సోమవారం నాడాయన కేసీఆర్ నగర్ ప్రభుత్వ ప్రైమరీ, హైస్కూల్, ఉర్దూ మీడియం పాఠశాలలను సందర్శించారు. ఓట్ల కోసం కోట్లు ఖర్చుపెట్టే ప్రభుత్వం విద్యార్థులకు సొంత భవనాలు నిర్మించకపోవడం బాధకరమన్నారు. మరుగుదొడ్ల పక్కన విద్యార్థులు పాఠాలు వింటున్నారని, ఆరుబయట భోజనం చేస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు పాఠశాలను సందర్శించి విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని కోరారు.



విద్యార్థులతో కలిసి నిరసన తెలుపుతున్న యుఎస్ఎఫ్ఐ నేత గుడికందుల రవి

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గజ్వేల్, జూన్ 16: మండల పరిధిలోని ఆయా గ్రామాల పరిధిలో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని డీఈ భానుప్రకాశ్ సోమవారం ప్రకటనలో తెలిపారు. గజ్వేల్ 132/32 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో మరమత్తుల కారణంగా ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు బంగ్లా వెంకటాపూర్, అహ్మదీపూర్, ధర్మారెడ్డిపల్లి, సింగాటం, బెజుగామ, వర్గల్ మండల పరిధిలోని మజీద్‌పల్లి, నెంటూర్, రాయపోల్ మండల పరిధిలోని బేగంపేట సబ్‌స్టేషన్ల పరిధిలోని ఆయా గ్రామాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

## గౌరవ వేతనం పెంచాలి

చేర్యాల, జూన్ 16: జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో గ్రామాల్లో కొనసాగుతున్న గ్రంథ పాలకులకు ప్రభుత్వం రూ.10వేల కనీస వేతనం మంజూరు చేయాలని గ్రంథ పాలకుల రాష్ట్ర అధ్యక్షుడు పాకల భిక్షపతి సోమవారం ప్రకటనలో కోరారు. తమ హోదా పేర్లు మార్చుకుంటూ ప్రభుత్వం వెళ్తుందని, కానీ తమ వేతనాల్లో మార్పు చేయడం లేదని వాపోయారు.

## సభను సక్సెస్ చేయాలి

మిరుదొడ్డి, జూన్ 16: రాష్ట్ర ప్రభుత్వ విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న కార్మికులను పర్మినెంట్ చేయాలని టీవీఏసీ జేఏసీ సిద్దిపేట జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ యాదగిరి గౌడ్ అన్నారు. సోమవారం తొగుట మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 18వ తేదీన హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద విద్యుత్ సంస్థలో విధులు నిర్వహిస్తున్న ఆర్టిజన్ కార్మికులను ప్రభుత్వం కన్వర్టు చేయాలని జరుపతలపెట్టిన సభను విజయవంతం చేయాలని కోరారు.

## ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య

అక్కన్నపేట, జూన్ 16: ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల్లో ఫెయిల్ అయ్యాననే మనస్తాపంతో ఓ విద్యార్థినీ సోమవారం ఆత్మహత్య చేసుకున్నది. అక్కన్నపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని దుబ్బతండా గ్రామ పంచాయతీ పరిధిలోని దాసుతండాకు చెందిన గుగులోతు హరిక (16) ఇటీవల ఓ సబ్జెక్టుకు సంబంధించి ఇంటర్ సప్లమెంటరీ పరీక్ష రాసింది. ఫలితాల్లో ఫెయిల్ కాగా, మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్నది. మృతురాలి తండ్రి సూర్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విజయ్‌భాస్కర్ తెలిపారు.

## హుండీ ఆదాయం లెక్కింపు

హుస్నాబాద్‌టౌన్, జూన్ 16: హుస్నాబాద్ శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయ హుండీ లెక్కింపు సోమవారం నిర్వహించారు. హుండి లెక్కింపులో రూ. 9,93,957 ఆదాయం సమకూరిందని, బంగారం, వెండి వచ్చిందని ఆలయ ఈవో కిషన్‌రావు తెలిపారు. గత ఏడాదికంటే ఈ ఏడాది రూ. 14వేల ఆదాయం అదనంగా సమకూరిందని చెప్పారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్‌రెడ్డి, ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు, గోమాత సేవా పరిషత్ సభ్యులు, అర్చకులు పాల్గొన్నారు.

**ప్రకటన**

ఇందుమూలముగా సమస్త ప్రజలకు తెలియపరచడం ఏమనగా, శ్రీ నిమ్మ సత్తిరెడ్డి, తండ్రి: బాల్‌రెడ్డి, నివాసం: పెద్దగుండవెల్లి గ్రామం వారికి రిజిస్టర్డ్ విక్రయ దస్తావేజు నెం. 281/2013 సబ్-రిజిస్ట్రార్ కార్యాలయం, దుబ్బాక మరియు ధరణి రిజిస్టర్డ్ విక్రయ దస్తావేజు నెంబర్లు 1164/2021, 1165/2021, 1166/2021, 1167/2021 మరియు 1168/2021 తహసీల్దార్ మరియు జాయింట్ సబ్-రిజిస్ట్రార్, దుబ్బాక ద్వారా సంక్రమించిన పెద్దగుండవెల్లి గ్రామంలో గల సర్వే నెం.లు 80/అ, 82/అ/1, 82/ఆ1/1, 82/ఆ1/2, 83/అ1, 83/ఆ1, 237/ఆ. వీటి విస్తీర్ణం ఎ. 1-00 గుంటలు, ఎ. 0-06 గుంటలు, ఎ. 0-20 గుంటలు, ఎ. 0-20 గుంటలు, ఎ. 0-06 గుంటలు, ఎ. 0-14 గుంటలు, ఎ. 0-14 గుంటలు మరియు ఎ. 0-09 గుంటలు వరుసగా గల దానిపై యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, తిమ్మాపూర్ బ్రాంచ్ యందు లోన్ మంజూరి కొరకు దరఖాస్తు చేసుకున్నారు. కానీ, శ్రీ నిమ్మ సత్తిరెడ్డి గారు సదరు ఆస్తి యొక్క ఒరిజినల్ లింక్ రిజిస్టర్డ్ విక్రయ దస్తావేజు నెం. 1831/2012, 1413/2015 మరియు 1790/2019 సబ్-రిజిస్ట్రార్ కార్యాలయం, దుబ్బాకలో రిజిస్టర్ కాబడినది పోయినట్లు తెలిపినారు. ఇట్టి విషయంలో పోలీస్ స్టేషన్ దుబ్బాక వారు జారీ చేసిన సర్టిఫికేట్ నెం. 15200406251626019645 గలది కూడా సమర్పించినారు. కావున, పై ఆస్తిపై గానీ, ఒరిజినల్ లింక్ దస్తావేజు విషయంలో గానీ, బ్యాంక్ లోన్ మంజూరి విషయంలో గానీ ఎవరికైనా ఏలాంటి హక్కులు, ఆక్షేపణలు ఉన్నచో సంబంధిత ఒరిజినల్ ఆధారాలతో (7) దినములలోగా నా కార్యాలయంలో సంప్రదించగలరు. గడువు తర్వాత నా క్లయింట్‌కు బ్యాంక్ సంబంధిత డాక్యుమెంట్ యొక్క నకలు కాపీలతో ఆస్తి పైన లోన్ మంజూరు చేయుదురు. తదుపరి ఎవరి ఆక్షేపణలు చెల్లనేరవు.

సం/- కె.సాయి నారాయణ, అడ్వకేట్
సిద్దిపేట, సెల్: 9848319114.

**పబ్లిక్ నోటీసు**

నా క్లయింట్ శ్రీ కలిదిండి సుబ్బరాజు, S/o లేట్ వెంకటరాజు R/o. 4/20 మెయిన్ రోడ్, సాన రుద్రవరం గ్రామం, కలిదిండి మండలం, కృష్ణ జిల్లా గారికి శ్రీ వంగ లింగారెడ్డి, S/o.చంద్రారెడ్డి, R/o. H.No.19-143/2 శ్రీనివాస్ నగర్, ప్రశాంత్ నగర్ గ్రామం, సిద్దిపేట జిల్లా గారు, సిద్దిపేట జిల్లా సిద్దిపేట అర్బన్ మండలం, తడకపల్లి గ్రామంలో ఉన్న సర్వే నెం.642/1, 642/అ1/3, సంబంధిత సర్వే నంబర్ లోని విస్తీర్ణం: ఎ.4-13 గుంటల వ్యవసాయ భూమిని విక్రయించారు. ఈ భూమికి సరిహద్దులు. తూర్పు: మైసని లింగం వ్యవసాయ భూమి, పశ్చిమం:15 అడుగుల బీట్ రోడ్ భూమి, ఉత్తరం: బక్కని స్వామి వ్యవసాయ భూమి & దక్షిణం: దుర్గని దుర్గయ్య భూమి, మరియు నా క్లయింట్ కొంత మొత్తాన్ని భయాన చెల్లించారు. ఏమనగా పైన పేర్కొన్న ఆస్తిపై ఎవరైనా హక్కు కలిగి ఉంటే, వారు తమ అభ్యంతరాలను డాక్యుమెంటరీ ఆధారాలతో క్రింద సంతకం చేసిన వ్యక్తికి నోటీసు ఇచ్చిన రెండు (2) వారాల లోపు సమర్పించవచ్చని సాధారణ ప్రజలకు ఇందుమూలంగా తెలియజేస్తున్నాము. నోటీసు అందిన రెండు వారాలలోపు వారు తమ అభ్యంతరాలను డాక్యుమెంటరీ ఆధారాలతో సమర్పించవచ్చు, విఫలమైతే అది పూర్తవుతుంది. అటువంటి క్లెయిమ్ గురించి ఎటువంటి ప్రస్తావన లేకుండా మరియు అదే ఏదైనా ఉంటే అది మాఫీ చేయబడినట్లుగా పరిగణించబడుతుంది.

S/o. S. RAGHAVA RAO
Advocate & Notary
Off: D.No. 9-2-41, Near Court, Siddipet.
Cell: 9848537010/9000743791